సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 10 । మార్చి । 2023



జీవాల వయస్సుకు తగ్గమేత

జీవాల వయస్సుకు తగిన మేత అందిస్తే ఆరోగ్యంగా ఉంటాయి. ఎండుమేతైనా, పచ్చిమేతైనా ముక్కలుగా చేసి అందించాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో▸



ప్రయాణం.. ప్రమాదకరం

కెరమెరి మండలంలోని జోడేఘాట్ వైపు వెళ్లే హట్టి ఘాట్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టు కుని రాకపోకలు సాగిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.2 /20.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ వేడి, ఉక్కబోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

12న ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఈ నెల 12న గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు పీటీజీ గురుకులాల ప్రిన్సిపాళ్లు సురేశ్, దివ్యారాణి, రమ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఆధార్, హాల్‌టికెట్‌తో గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 811 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని వెల్లడించారు.

బంజారా కమ్యూనిటీ భవన్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే సక్కుకు వినతిపత్రం ఇస్తున్న సేవాలాల్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్: మండలంలోని బాబాపూర్‌లో బంజారా కమ్యూనిటీ భవన్ ఏర్పాటు చేయాలని సేవాలాల్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు ఆయన నివాసంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి బదావత్ శివప్రసాద్ నాయక్ మాట్లాడుతూ తమ గ్రామంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జగదాం ఆలయాలు ఉన్నాయని, దీక్షమాల ధరించే భక్తులకు వంట చేసుకోవడం, విశ్రాంతి తీసుకోవడానికి ఆలయ ప్రాంగణంలో షెడ్ నిర్మించాలని కోరారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారకులు బదావత్ ఇందులాల్ నాయక్, జాగోత్ వస్రం, బదావత్ మాతృలాల్, గణేశ్, తిరుపతి, మంగులాల్ ఉన్నారు.

11న డీవైఎఫ్ఐ జిల్లా స్థాయి సమావేశం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కార్తీక్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఈ నెల 11న డీవైఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా విస్తృత స్థాయి సమావేశాలకు రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ హాజరవుతారని తెలిపారు. కరోనా మహమ్మారితో దేశవ్యాప్తంగా సుమారు 56 లక్షల మంది యువత ఉద్యోగాలు కోల్పోయి రోడ్డు పద్దారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలు స్థాపించి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్కుటే శ్యామ్‌రావు, నాయకులు దుర్గం రాజ్‌కుమార్, దుర్గం నిఖిల్, టీకానంద్, జాడి తిరుపతి పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌రూరల్: పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో నాలుగు మండలాల పదో తరగతి విద్యార్థులకు డీఈవో అశోక్ ఆధ్వర్యంలో వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పుడు సమయాన్ని వృథా చేసుకుని భవిష్యత్తులో బాధపడొద్దన్నారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ప్రతీ నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణులు జయకృష్ణ విద్యా విలువలు, లక్ష్యాల సాధన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, సైన్స్ అధికారి మధుకర్, విద్యాశాఖ కోఆర్డినేటర్లు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎంపీపీ మల్లికార్జున్, విషయ నిపుణులు సంతోష్, తిరుపతయ్య, రాజేశం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఆరుతడి

గతేడాది వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడంతో దిగుబడులు తగ్గిపోయాయి. వర్షాలకు భూగర్భజలాలు సమృద్ధిగా ఉండటంతో యాసంగి సాగు విస్తీర్ణం పెరిగింది. ముఖ్యంగా ఆరుతడి పంటలు ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతలు మంచి దిగుబడి వస్తుందని నమ్మకంతో ఉన్నారు.

- జిల్లాలో పుష్కలంగా భూగర్భ జలాలు
- పెరిగిన యాసంగి సాగు విస్తీర్ణం
- 38,898 ఎకరాల్లో పంటలు
- దిగుబడిపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలు

యాసంగి సాగు వివరాలు (ఎకరాల్లో)

వరి	14,535	మొక్కజొన్న	2,204
జొన్న	9,996	పెసర	2,144
శనగ	7,811	గోధుమ	1,217

ఇతర 991



కౌటాల మండలం తలోడి గ్రామంలో సాగుచేసిన మొక్కజొన్న

కౌటాల(సిర్పూర్): కొన్నేళ్లుగా జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. గతంలో వర్షాధారంగా పంటలు సాగు చేసిన రైతులు క్రమంగా బావులు, బోర్లు, ప్రాజెక్టుల కింద ఆరుతడి పంటలు వేసుకుంటున్నారు. యాసంగి సీజన్‌లో కౌటాల, ఆసిఫాబాద్, రెబ్బెన, దహెగాం, కాగజ్‌నగర్, బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాలలో వరి పంట ఎక్కువగా సాగవుతుండగా, దాదాపు అన్ని మండలాల్లో ఆరుతడి పంటలు సాగులో ఉన్నాయి. జిల్లాలో అధికంగా 14,535 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తుండగా, 9,996 ఎకరాల్లో జొన్న, 7,811 ఎకరాల్లో శనగ, 2,204 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. అలాగే పెసర, గోధుమలు, కంది, వేరుశనగ, నువ్వులు, సోయాబీన్, కుసుమ, పత్తి పంటలు కూడా యాసంగిలో పండిస్తున్నారు.

దిగుబడిపై ఆశలు..

యాసంగి సీజన్‌లో సాగు చేస్తున్న పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. మొక్కజొన్నతో అధిక ఆదాయం వస్తుందని భావించిన రైతులు రెండు వేలకు పైగా ఎకరాల్లో పండిస్తున్నారు. మొక్కజొన్న చేతికందే దశలో ఉండగా, ఇప్పటి వరకు తెగుళ్ల సమస్య అంతగా లేదని సాగుదారులు చెబుతున్నారు. చివరి నీటి తడులు అందిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అడవి పందుల బెడద కొంత ఇబ్బంది పెడుతోంది. ఈ సమస్యను అధిగమించడానికి రైతులు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. చేను వద్దే మంచెలు వేసుకుని రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. పందులను భయపెట్టేందుకు రకరకాల చప్పుళ్లు చేస్తున్నారు.

‘ఆరుతడి’తోనే లాభాలు..

వానాకాలంలో సిర్పూర్ డివిజన్ పరిధిలోని చింతలమానెపల్లి, కౌటాల, దహెగాం, పెంచికల్‌పేట్ మండలాలాల్లో పెద్దవాగు, ప్రాణహిత వరదలతో పంటలు దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు వరి, సోయా, కంది, పత్తి పంటలకు చీడపీడల బెడద ఎక్కువైంది. పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ బావుల్లో నీటితో యాసంగిలో ఆరుతడి సాగుపై అన్నదాతలు దృష్టి సారించారు. దీంతో మొక్కజొన్న, శనగ, పెసర, జొన్న స్వల్పకాలిక పంటల సాగు పెరిగింది. జైనూర్, లింగాపూర్, తిర్యాణి, కెరమెరి వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో సాగునీటి వనరులు అంతగా లేకున్నా జొన్నసాగుపై దృష్టి పెట్టారు. నీటి సదుపాయం ఉన్న వారు కూరగాయలు, ఇతర పంటలు వేసుకున్నారు. పంటలు చేతికందే వరకు విద్యుత్ కోతలు లేకుండా ఆ శాఖ అధికారులు సహకరించాలని రైతులు కోరుతున్నారు.

బావి నీటితో సాగు



వ్యవసాయ బావిలో సరిపడా నీళ్లుండటంతో ఎకరంలో వరితోపాటు రెండెకరాల్లో మొక్కజొన్న వేశా. మక్కలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. వరికి నీళ్ల పెట్టడంలో కొంత ఇబ్బందవుతోంది. కొద్దిరోజుల్లో మొక్కజొన్న చేతికందే అవకాశం ఉంది. ఆరుతడి పంటలతోనే లాభం ఉంటుంది.

– శ్రీనివాస్, రైతు, తలోడి

మొక్కజొన్న వేసిన



ఐదెకరాల్లో వేసిన మొక్కజొన్న ఏపుగా పెరిగింది. యాసంగిలో వేసిన పంటలకు వన్యప్రాణుల నుంచి ముప్పు ఉండటంతో పగలు, రాత్రి కాపలా ఉంటున్నా. మొక్కజొన్న లేత కంకి దశకు చేరుకుంది. ప్రస్తుతానికి నీటి సమస్య, తెగుళ్ల బాధలేదు. ఈ సారి దిగుబడి బాగుంటుందని ఆశిస్తున్నా.

– రవి, రైతు, తలోడి

రైతులకు లాభాలు

జిల్లాలో తెగుళ్ల ఉధృతి లేకపోవడంతో వరి, మొక్కజొన్న పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆరుతడి పంటల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని రైతులకు అవగాహన కల్పించాం. రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

– శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

పట్టుదలతో చదివి విజయం సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌రూరల్: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పట్టుదలతో చదివి విజయం సాధించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం స్టడీ సర్కిల్‌లో కొనసాగుతున్న శిక్షణను గురువారం ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిరిజన యువత కోసం గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలకు శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రమశిక్షణతో చదువుకు ప్రభుత్వ కొలువులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం స్టడీ సర్కిల్‌కు రూ.50వేల చెక్కు అందజేశారు. స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ రాము, నిర్వాహకులు ఊశన్న, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

‘డయాలసిస్ కేంద్రం ఏర్పాటులో నిర్లక్ష్యం’

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సుమారు 400 మందికి పైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని తెలిపారు. వారు ప్రతీ వారం రెండు, మూడు సార్లు డయాలసిస్ కోసం మంచిర్యాలకు వెళ్లివచ్చేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో రూ.కోట్లతో నిర్మించిన ప్రభుత్వాసుపత్రిలో ఇప్పటికీ సరైన వసతులు లేవన్నారు. వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు రెండు నెలల్లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి సుమారు ఏడాది గడుస్తున్నా అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయి వసతులతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

ముందుంది వేసవి ముప్పు!



అటవీ ప్రాంతంలోని సహజ నీటి వనరు

- అడవులు, వన్యప్రాణుల రక్షణపై అటవీశాఖ నజర్
- కార్చిచ్చుల నివారణకు ఫైర్‌లైన్లు ఏర్పాటు
- వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు నీటి కుంటల నిర్మాణం

పెంచికల్‌పేట్(సిర్పూర్): జిల్లాలోని కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పులులతోపాటు ఎన్నో అరుదైన జంతువులు, పక్షులకు ఆవాసంగా నిలుస్తోంది. వేసవి ప్రారంభం కావడంతో చిన్న నిప్పురవ్వ రగిలినా ఏర్పడే అగ్ని ప్రమాదాలు వన్యప్రాణులకు తీవ్ర నష్టం చేకూరుస్తాయి. అలాగే ఏప్రిల్, మే నెలల్లో నీటి వనరులు ఎండిపోతే జంతువులు తాగునీటికి తిప్పలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల సంరక్షణకు ముందస్తు చర్యలు ప్రారంభించారు.

6,04,172 ఎకరాల అటవీ విస్తీర్ణం

జిల్లా వ్యాప్తంగా 6,04,172 ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్ల పరిధిలో 11 రేంజ్‌లు, 79 సెక్షన్‌లు, 245 బీట్లు, 846 కంపార్టుమెంట్లు ఉన్నాయి. ఆయా రేంజ్‌ల పరిధిలో అరుదైన వృక్ష జాతులతోపాటు వన్యప్రాణులు, వివిధ రకాల పక్షులు ఆవాసం ఏర్పర్చుకుని మనుగడ సాగిస్తున్నాయి. వేసవి దృష్ట్యా వన్యప్రాణుల సంరక్షణ అటవీశాఖ అధికారులకు సవాలుగా మారింది.

నిప్పుతో ముప్పు..

చెట్లు ఆకురాల్చడంతో వేసవిలో అటవీప్రాంతాల్లో కార్చిచ్చులు ఏర్పడేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అలాగే అడవులకు వెళ్లే పశువుల కాపరులు, స్మగ్లర్లు వేసే నిప్పుతో వన్యప్రాణుల ఆవాసానికి ముప్పు పొంచి ఉంటుంది. అగ్ని ప్రమాదాల నివారణకు అటవీశాఖ అధికారులు ఇప్పటికే ముఖ్యమైన ప్రాంతాల్లో కూలీలతో ఫైర్‌లైన్లు ఏర్పాటు చేశారు. మంటలు చెలరేగినా వేగంగా అదుపు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

తాగునీరు.. ఆహారం

ఏటా వేసవిలో వన్యప్రాణులు తాగునీటి కోసం గ్రామాల్లోకి వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ముఖ్యంగా జింకలు కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోతున్నాయి. దీంతో అధికారులు ముందస్తుగా సహజనీటి వనరులను గుర్తిస్తున్నారు. నీటి లభ్యత ఉండేలా చెత్తాచెదారం తొలగించి నీటి కుంటలు, చెలిమెలను అభివృద్ధి చేస్తున్నారు. మరో వైపు అడవుల్లో కృత్రిమంగా నిర్మించిన నీటి కుంటల్లోనూ సోలర్ విద్యుత్‌తో పంపులు ఏర్పాటు చేసి నీటితో నింపుతున్నారు. మార్చి చివరి వారం నుంచి సాసర్‌పిట్‌లను కూడా నీటితో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో పెద్దపులుల సంచారం ఎక్కువగా ఉంటుంది. శాఖాహార జంతువుల సంతతి తగ్గితే సమీప గ్రామాల్లో పశువులపై దాడులకు దిగే అవకాశం ఉంటుంది. శాఖాహార జంతువుల సంతతిని పెంచేందుకు అగర్‌గూడ, పోతెపల్లితోపాటు సిర్పూర్ రేంజ్ పరిధిలోని అటవీప్రాంతాల్లో ఇప్పటికే గడ్డి క్షేత్రాలను ఏర్పాటు చేశారు. పులులు ఆహారం కోసం అడవులు నుంచి బయటికి రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



అగర్‌గూడ అటవీప్రాంతంలో కొనసాగుతున్న ఫైర్‌లైన్ ఏర్పాటు పనులు (ఫైల్)

జాగ్రత్తలు తీసుకుంటున్నాం

అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు ముప్పు వాటిల్లకుండా ఇప్పటికే ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అడవుల్లో నిప్పు రగలకుండా ఫైర్‌లైన్లు ఏర్పాటు చేశాం. నీటి కుంటలు, చెలిమల్లో నీరుండేలా పనులు చేపడుతున్నాం. గడ్డి క్షేత్రాలను మెరుగుపరిచాం. వేసవిలో చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశాం. ఉద్దేశపూర్వకంగా వన్యప్రాణులకు హాని తలపెడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎస్.వేణుగోపాల్, ఎఫ్ఆర్వో, పెంచికల్‌పేట్

ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ రాజేశం, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,39,920 ఆహార భద్రత కార్డుల ద్వారా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు, అధికారులు నిత్యం రేషన్ దుకాణాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కాకుండా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. అలాగే సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది సరుకుల తూకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం రేషన్ దుకాణాల సంఖ్యను పెంచాలని జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే కోరగా, తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆన్‌లైన్ పోర్టబుల్ సిస్టం అమలులో ఉన్నందున జిల్లాలో ఎక్కడి నుంచైనా బియ్యం తీసుకునే అవకాశం ఉందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, పౌరసరఫరాల శాఖ అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో మాతాశిశు మరణాలను వందశాతం నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి జిల్లా వైద్యాధికారులు, ప్రాథమిక కేంద్రాల వైద్యాధికారులతో ప్రజల ఆరోగ్యం, గర్భిణుల సంక్షేమం, రక్తహీనత లోపం నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణుల వివరాలు సక్రమంగా నమోదు చేసుకుని వారికి వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. రక్తహీనత ఉన్నవారికి మందులు, పోషకాహారం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగేలా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ డెఎంహెచ్‌వోలు సుధాకర్‌నాయక్, సీతారం తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కాగజ్‌నగర్‌టౌన్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో అందించే ఉచిత శిక్షణ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ రఘునాథ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 వరకు కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీ నగర్ ప్రైమరీ స్కూల్ శిక్షణ కేంద్రంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ఉచిత శిక్షణలో భాగంగా అభ్యర్థులకు భోజన వసతి కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9182809245 నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

కాగజ్‌నగర్‌టౌన్: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న మేస్త్రీలు, కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. తాపీ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన కొటేషన్ పత్రాలను కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ రంగం మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉండాలి



భూమిపూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

వాంకిడి(ఆసిఫాబాద్): వైద్యులు, సిబ్బంది నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం సందర్శించి బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

నూతన భవన నిర్మాణాలకు భూమిపూజ

మండల కేంద్రంలో వ్యవసాయ సహకార సంఘం నూతన భవనం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు తరగతి గదుల నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు గురువారం భూమిపూజ చేశారు. పీఏసీఎస్ గిడ్డంగిని రూ.10లక్షలతో నిర్మించనున్నట్లు చైర్మన్ జబోరె పెంటు తెలిపారు. కాగా ఆస్పత్రి అదనపు గదుల నిర్మాణానికి రూ.1.56కోట్లు మంజూరయ్యాయి. ఎంపీపీ విమలబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచులు తుకారాం, కిష్టు, కమలాకర్, అయ్యుబ్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈ స్టీవెన్, నాయకులు దీపక్ ముండె, అశోక్ మహోల్కర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌వోలు

కెరమెరి(ఆసిఫాబాద్): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకోమని జిల్లా సెక్టోరియల్ అధికారులు సుభాష్, ఆబిద్ అలీ అన్నారు. కెరమెరి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయాన్ని గురువారం వారు సందర్శించారు. అన్ని పాఠశాలల నుంచి వచ్చిన యూడైస్ ప్లస్ ప్రొఫార్మాను సక్రమంగా పరిశీలించాలని ఆదేశించారు. త్వరలోనే నిర్వహించే వర్క్‌షాప్‌నకు సిద్ధంగా ఉండాలని సూచించారు. డీఈవోతో చర్చించి సీఆర్పీల కొరత సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బయోమెట్రిక్ వేయని ఉపాధ్యాయులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. సెలవులకు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ఆటో బోల్తాపడి ఒకరు మృతి


బాలునాయక్ (ఫైల్)

జన్నారం(ఖానాపూర్): ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలంలోని చింతగూడకు చెందిన బాలునాయక్ (56) గురువారం ఉదయం సొంత పని నిమిత్తం ఉట్నూర్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆటో ఎక్కి ఇంటికి వస్తుండగా ఇందన్‌పల్లి సమీపంలో ఆటో ముందుటైర్ పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో బాలునాయక్‌కు తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అందులో ప్రయాణిస్తున్న మరో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. మృతునికి భార్య సూరబాయి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాలీ ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

చెన్నూర్‌రూరల్: ఆస్నాద సమీపంలో గురువారం ట్రాలీ ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొక్కూరు నుంచి ఆస్నాద వైపు వెళ్తున్న ట్రాలీఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న వరిపొలాల్లో పడి పోయింది. ఆ సమయంలో ఆరుగురు ప్రయాణికులు ఉండగా కిష్టస్వామి, ఆశయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు.

పలువురిపై తేనెటీగల దాడి

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో పలువురిపై తేనెటీగలు దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పిట్టల లక్ష్మయ్య గురువారం మృతి చెందారు. మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్తుండగా శవయాత్రలో పాల్గొన్న పలువురిపై తేనె టీగలు దాడిచేశాయి. సుమారు 20 మందిపై దాడి చేయడంతో గాయాలపాలైనట్లు స్థానికుల ద్వారా తెలిసింది. బాధితులు లక్సెట్టిపేట, ధర్మపురి, దండేపల్లి ఆస్పత్రులకు వెళ్లి చికిత్స తీసుకున్నట్లు సమాచారం.

చెరువులకు బౌండరీలు ఏర్పాటు చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జన్నారం: మండలంలో కబ్జాకు గురైనట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో చెరువులకు బౌండరీలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. గురువారం మండలంలోని సింగరాయిపేట చెరువు, పొనకల్ చెరువులను ఆర్డీవో వేణుతో కలిసి పరిశీలించారు. చెరువులపై తహసీల్దార్ వెంకటకిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. మండలంలోని కిష్టాపూర్, ఒడ్డెపల్లి చెరువు, సింగరాయిపేట్, పొనకల్ చెరువులకు బౌండరీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జీవాల వయస్సుకు తగ్గమేత

- పౌష్టికాహారంతో జీవాలు బలిష్టం
- ముక్కలుగా చేసి అందిస్తే మేలు


గొర్రెలు, మేకలు

మంచిర్యాలఅగ్రికల్చర్: గొర్రెలు, మేకలకు ఏ వయసులో ఎంత దాణా ఇవ్వాలి.. ఎండుగడ్డి, పచ్చిగడ్డి ఎంత మోతాదులో అందించాలి.. అనే విషయాలను పెంపకందారులు తెలుసుకోవడం చాలా అవసరం. మూగజీవాల వయసును బట్టి సరైన మోతాదులో ఆహారం అందిస్తే అవి బాగాఎదిగి బలిష్టంగా తయారవుతాయని, ఎండుమేతైనా, పచ్చిమేతైనా ముక్కలుగా చేసి అందిస్తే మేలని జిల్లా పశువైద్యాధికారి వై.రమేశ్‌కుమార్ సూచిస్తున్నారు.

గొర్రె పిల్లలకు..
తల్లి పాలు తాగే వయసులో గొర్రె పిల్లలు కొరికి తినేందుకు వీలుగా ఎండిన లెగ్యూమ్ జాతి పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచాలి. 6 నుంచి 8 వారాల వయసు పిల్లలకు మధ్యగడ్డి, పప్పుజాతి ఎండుగడ్డి, నలగ్గొట్టిన గింజలు ఇవ్వాలి. 8 వారాల దాటిన తర్వాత తల్లి నుంచి పిల్లలను వేరు చేస్తారు. ఆ దశలో వాటికి క్రీపు దాణాను అందిస్తే త్వరగా ఎదుగుతాయి. ప్రతీరోజు ఒక్కో గొర్రె పిల్లకు 250 నుంచి 450 గ్రాముల దాణా, 2 కిలోల పచ్చిమేత అందేలా చూడాలి.

ఎదకు వచ్చిన సమయంలో..
గొర్రె ఎదకు వచ్చి పొర్లే సీజన్‌లో పప్పు జాతికి చెందిన ఎండుగడ్డితో పాటు రోజుకు 100 గ్రాముల ధాన్యపు గింజలు లేదా శరీర బరువులో 10వ వంతు పచ్చిమేత, 100 గ్రాముల వేరుశనగ చెక్క అందించాలి.

చూడికట్టిన సమయంలో..
చూడికట్టిన గొర్రెలకు సరైన మేత అందిస్తే పుట్టే పిల్లలు బలంగా ఉంటాయి. పాల దిగుబడి పెరుగుతుంది. అందుకే తినగలిగినంత ధాన్యపు జాతి పశుగ్రాసంతో పాటు రోజుకు 50 గ్రాముల వేరుశనగ చెక్క (పల్లిపొట్టు)అందించాలి. లేదంటే పొలాల్లో లభించే పంట అవశేషాలతో పాటు 100 గ్రాముల వేరుశనగ చెక్క అందించాలి.

ఈత సమయంలో..
గొర్రె ఈత సమయంలో ఆహారంలో ధాన్యపు గింజల పరిమాణం తగ్గించి నాణ్యమైన ఎండుమేత అందించాలి. ఈనిన తర్వాత నుంచి వారం రోజుల పాటు తౌడు, గింజల్ని 50 శాతం చొప్పున ఇవ్వాలి. పాలిచ్చే గొర్రెలకు ప్రతీరోజు 450 గ్రాముల ఎండుమేత , 250 గ్రాముల ధాన్యపు జాతి గింజల చొప్పున ఇవ్వాలి. లేదంటే 10 కిలోల పశుగ్రాసం అందించాలి. రెండేళ్ల పైబడిన తర్వాత మేతతో పాటు ప్రతీరోజు 500 నుంచి 1000 గ్రాముల దాణా ఇవ్వాలి. పిల్లలు పుట్టిన తర్వాత 5 రోజుల పాటు జున్ను పాలు తాగించాలి. ఆ తర్వాత శరీర బరువులో 1/6వ వంతు చొప్పున నెల రోజుల పాటు పాలు తాగించాలి. రెండో నెల నుంచి శరీర బరువులో 1/15వ వంతు చొప్పున ఇవ్వాలి. పుట్టిన 2వ వారం నుంచి పిల్లలకు రుచికరమైన స్టార్టర్ దాణా, పచ్చిమేత ఇవ్వాలి. 3 నెలల వయసు నిండిన పిల్లలకు పాలు ఇవ్వడం మానేయాలి. 50 శాతం జొన్న, 25శాతం తౌడు, 12శాతం వేరుశనగ చెక్క, 11వెన్న తీసిన పాలపొడి, 2 శాతం ఖనిజ లవణ మిశ్రమంతో తయారు చేసుకున్న స్టార్టర్ దాణా అందించాలి. గొర్రెలు, మేకలకు దాణాతో పాటు ఖనిజ లవణ మిశ్రమం ఇవ్వడం వల్ల అవి ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. జీవాలు త్వరగా ఎదకు వస్తాయి. స్టాండర్డ్ కంపెనీలు చేసిన మిశ్రమాన్ని 2 శాతం మేర దాణాలో కలపాలి. లేదా విడిగా కూడా ఇవ్వవచ్చు. దాణాలో 1శాతం రాళ్ల ఉప్పును కూడా కలుపాలి.

నీటిని అందించడం ఇలా..
సాధరణంగా జీవాలకు వాటి శరీర బరువులో 10 శాతం నుంచి 12 శాతం నీరు అవసరమవుతుంది. కాబట్టి ప్రతీరోజు ఒక్కో జీవానికి సుమారు 5 లీటర్ల నీటిని అందుబాటులో ఉంచాలి. ఫారాల్లో మేత తొట్లను ఏర్పాటు చేసినట్లు నీటితొట్లను కూడా ఏర్పాటు చేయాలి.

75 శాతం సబ్సిడీపై విత్తనాలు



స్వీట్‌సూడన్ గ్రాస్ ఎస్ఎస్‌జీ 898 రకం 5 కిలోల బ్యాగులను ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తోంది. ఎకరాకు 15 కిలోల చొప్పున విత్తుకోవాలి. నాలుగు తడుల నీటితో 30 రోజుల చొప్పున నాలుగు సార్లు కటింగ్‌కు వస్తుంది. 30 నుంచి 40 టన్నుల వరకు పచ్చిమేత, 15 నుంచి 20 టన్నుల వరకు ఎండు గడ్డి దిగుబడి వస్తుంది. పూత దశకు వచ్చే సమయంలో కోతకోసి వాముగా నిల్వచేసుకోవచ్చు.
– జిల్లా పశువైద్యాధికారి

ముక్కలు చేసి మేపాలి
పచ్చిమేత, ఎండుమేతలను అలాగే మేపితే జీవాలు వాటిని పూర్తిగా తినవు. పచ్చి పశుగ్రాసాల కాండాలు, చొప్పదంట్లు పెద్దవిగా లావుగా, ఆకులు వెడల్పుగా పొడవుగా ఉండడమే కారణం. జీవాలు కేవలం లేత ఆకుల్ని మాత్రమే పూర్తిగా తిని కాండాలు, దంట్లను వదిలేస్తాయి. అంతే కాకుండా వాటిని తొక్కి పాడుచేస్తాయి. మరోవైపు చొప్ప వంటి ఎండుమేత కొరత కూడా రోజురోజుకూ పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మేతను పూర్తిగా వినియోగించుకోవాలి. ఇందుకు మేతను చిన్నచిన్న ముక్కలుగా కత్తిరించి మేపాలి. ఫారాల్లో పెంచే గొర్రెలు, మేకలకు పశుగ్రాసాన్ని చిన్నచిన్న ముక్కలుగా చేసి అందించడానికి చాఫ్ కట్టర్, దాణా తయారు చేసుకోవడానికి గ్రైండర్ కమ్ మిక్సర్ ఉపయోగపడుతాయి. జొన్న, సజ్జ, మొక్కజొన్న చొప్పలను ఎండుమేతగా ఉపయోగించుకోవచ్చు.

పాఠశాలలు సందర్శించిన రాష్ట్ర బృందం


భీమిని పాఠశాలలో బృందం సభ్యులు

భీమిని(బెల్లంపల్లి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం రాష్ట్ర పరిశీలన బృందం సందర్శించింది. సభ్యులు పాఠశాలలో రికార్డులు, మార్కుల నమోదు ప్రక్రియ, తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశపెట్టిన తొలిమెట్టు కార్యక్రమం ద్వారా ప్రాథమిక విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యాసాగర్ అన్నారు. అనంతరం భీమిని ఉన్నత పాఠశాలతో పాటు జగ్గయ్యపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో పీఎంకేవీవై 4.0 షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. పదోతరగతి, ఐటీఐ పూర్తి చేసిన, ఐటీఐ మధ్యలో ఆపేసిన 16 నుంచి 45 సంవత్సరాల అభ్యర్థులు అర్హులన్నారు. ఎలక్ట్రిక్ డొమెస్టిక్ సొల్యూషన్, సోలార్ ఎల్ఈడీ టెక్నీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, వెబ్ డెవలపర్ కస్టమైజ్డ్ కోర్స్, వెల్డర్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'సుగుణ'కు సుష్మాస్వరాజ్ అవార్డు


అవార్డు అందిస్తున్న బండి సంజయ్

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన మహిళా రైతు నందుర్క సుగుణ సుష్మాస్వరాజ్ అవార్డుకు ఎంపికైంది. నాగసముద్రం గ్రామానికి చెందిన సుగుణ వ్యవసాయంలో సేంద్రియ సాగుతో పాటు విభిన్న రకాల పంటలు పండించి పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆమెను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. తెలంగాణ మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాలతి పాల్గొన్నారు.

ట్యాక్స్ చెల్లించని ఇసుక ట్రాక్టర్లు సీజ్


నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్లు

నెన్నెల(బెల్లంపల్లి): జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్య ఆదేశాల మేరకు గురువారం నెన్నెలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్యాక్స్ చెల్లించకుండా ఆన్‌లైన్ ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఒక ఫ్లో ట్రాక్టర్, ట్రాలీ ఆటోను సీజ్ చేసినట్లు మంచిర్యాల అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యూష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలను రిలీజ్ చేయాలంటే ట్యాక్స్‌తో పాటు పన్నుపై 200 శాతం పెనాల్టీ కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. వాహనదారులు తమంతట తామే ట్యాక్స్ చెల్లించి పెనాల్టీ నివారించుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా అన్ని ధ్రువపత్రాలు ఉన్న ట్రాక్టర్లకే ఆన్‌లైన్‌లో ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాల్సిన మైనింగ్ శాఖ ప ట్టుబడ్డ ఈ ట్రాక్టర్లకు ఆన్‌లైన్ అనుమతి ఎలా ఇచ్చిందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ప్రాణహిత సరిహద్దులో విస్తృత తనిఖీలు


వేలిముద్రలు సేకరిస్తున్న సీఐ విద్యాసాగర్

కోటపల్లి/వేమనపల్లి: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్న ప్రాణహిత నదీ తీరప్రాంతాల్లో గురువారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, నీల్వాయి ఎస్సై నరేశ్, కోటపల్లి ఎస్సై వెంకట్ ఆధ్వర్యంలో రాచర్ల, వెంచపల్లి, జనగామ, ఆలుగామ గ్రామాలను సందర్శించి ఫెర్రీ పాయింట్లతో పాటు వంతెనల వద్ద సోదాలు నిర్వహించారు. అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు వివరాలు సేకరించారు. సరిహద్దు భద్రతపై గ్రామస్తులతో చర్చించారు. అనంతరం నదిలో చేపలు పట్టేవారితో మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు సరిహద్దులో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వచ్చిన అనుమానితుల వేలిముద్రలను సేకరించి వివరాలు నమోదు చేసుకున్నారు.

జిల్లా కేంద్రంలో చోరీకి యత్నం


పట్టుబడిన నిందితుడు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ సమీపంలో సోలంకి రమేశ్ ఇంట్లో బుధవారం రాత్రి చోరీకి యత్నించిన వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం సదరు వ్యక్తి కాళ్లకు సంచులు కట్టుకుని చప్పుడు కాకుండా ఇంట్లోకి ప్రవేశించాడు. గమనించిన పెంపుడు కుక్కలు అరవడంతో మేలుకున్న రమేశ్ ఇద్దరు కుమారులు దొంగను పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం ఫిర్యాదు చేసేందుకు రమేశ్ భార్య పావని పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా సదరు దొంగ కనిపించలేదు. పోలీసులను ప్రశ్నించగా అతనికి మతిస్థిమితంలేదని, లారీ ఎక్కించి మహారాష్ట్రకు పంపించామని సమాధానం ఇచ్చారు. దొంగ పిచ్చివాడయితే పిచ్చాసుపత్రికి పంపించాలని, లారీలో ఎక్కించి మహారాష్ట్ర పంపించడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసుల తీరుపై బాధితులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్సై రమేశ్‌ను సంప్రదించగా దీనిపై తమకు ఫిర్యాదు రాలేదన్నారు.

ఎడ్లబండిని ఢీకొని వ్యక్తి మృతి

సిర్పూర్(టి): ద్విచక్ర వాహనంతో ఎడ్లబండిని ఢీకొన్ని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై డీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం హుడ్కిలి గ్రామానికి చెందిన చౌదరి జనార్దన్(45) కామ్డె దేవాజి బుధవారం రాత్రి బైక్‌పై హుడ్కిలి నుంచి దుబ్బగూడవైపు వెళ్తుండగా ఎడ్లబండిని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజికి ఆస్పత్రికి తరలించగా జనార్దన్ అప్పటికే మృతి చెందాడు. తీవ్రగాయాలైన దేవాజీని కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం మంచిర్యాలకు తరలించారు. మృతుని కుమారుడు జగదీశ్ ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా ఎడ్లబండి నడపడమే కాకుండా రాంగ్‌రూట్‌లో వచ్చి మృతికి కారణమయ్యాడని తోర్ సంతోశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరు మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): భూమి హద్దు విషయంలో తీవ్రంగా దూషించడంతో మనస్తాపానికి గురై వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై భూమేశ్ తెలిపారు. మండలంలోని కొండపల్లికి చెందిన బుర్స బాపు (62), అదే గ్రామానికి చెందిన లొండి పుల్లుబాయికి మధ్య భూమి హద్దు విషయంలో గొడవలు జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం సైతం అదే హద్దు విషయంలో పుల్లుబాయి దూషించటంతో బాపు బాధపడుతూ ఇంటికి వచ్చాడు. విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. కుమారుడు భీంరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య


గనుజీ (ఫైల్)

బెల్లంపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట గురువారం ఓ వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ అవుట్ పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గంగారాంనగర్‌లో నివాసం ఉంటున్న మోచి వృత్తిదారుడు కామ్లే గనుజీ (77) బల్లార్షా నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

జైపూర్(చెన్నూర్): మండలం ఇందారం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన నాగులమల్యాల రాజమౌళి, గజ్జి రాజయ్య గురువారం పనినిమిత్తం మంచిర్యాల జిల్లాలోని ముల్కల్లకు కారులో వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా ఇందారం క్రాస్‌రోడ్డు సమీపంలో కారు అదుపుతప్పి సెంట్రల్ లైటింగ్ నిమిత్తం ఏర్పాటు చేసిన దిమ్మలకు ఢీకొని బోల్తా పడింది. ఇద్దరికి గాయాలు కావడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

తొలగించిన డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలి


దీక్షలో పాల్గొన్న కాంట్రాక్టు డ్రైవర్లు

శ్రీరాంపూర్(మంచిర్యాల): తొలగించిన డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట కాంట్రాక్టు డ్రైవర్లు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ క్వాలిటీ జీఎం కారుడ్రైవర్ హుస్సేన్‌ను ఇటీవల అకారణంగా తొలగించారన్నారు. డ్రైవర్ విధులే కాకుండా తన ఇంటి పనులు కూడా చేయాలని సదరు అధికారి, వారి కుటుంబం వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. దీన్ని ప్రశ్నిస్తే విధుల్లోంచి తొలగించారన్నారు. సదరు అధికారి తీరుకు నిరసన వ్యక్తం చేస్తే 10 మంది డ్రైవర్లపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. పెట్టిన కేసులను ఎత్తివేసి వెంటనే డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకునేంత వరకు తమ నిరసన కొనసాగుతుందన్నారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి సీసీసీ పోలీస్ స్టేషన్‌లో సదరు అధికారిపై ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు పెండం శివ, బండి తిరుపతి, హుస్సేన్, శ్రీకాంత్, అఖిల్, వినోద్, లక్ష్మణ్, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు హెచ్ఐవీ, టీబీ పరీక్షలు


మాట్లాడుతున్న సుబ్బరాయుడు

లక్సెట్టిపేట(మంచిర్యాల): జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గురువారం లక్సెట్టిపేటలోని సబ్‌జైలులో ఖైదీలకు హెచ్ఐవీ, టీబీ, సుఖవ్యాధులు, హెపటైటిస్(బి), (సి), సంబంధిత వ్యాధులకు సంబంధించి రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఖైదీలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ఫయాజ్‌ఖాన్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, సబ్‌జైలు అధికారి స్వామి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న అశోక్

భీమారం: రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెలు, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఆయనను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గొర్రెల కాపరులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. 60 ఏళ్లు నిండిన కాపరికి నెలకు రూ.5 వేల పింఛన్ అందించాలని తెలిపారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున షీప్ ఫాం అభివృద్ధి చేసి రుణాలు అందించాలని కోరారు. ఇందుకోసం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి యాదవులకు వివరించాలని విన్నవించారు. 80 శాతం సబ్సిడీపై గేదెలు అందించాలని కోరారు. వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

'గురుకులం'ను సందర్శించిన సివిల్ జడ్జి

లక్సెట్టిపేట(మంచిర్యాల): పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలను గురువారం సివిల్ జడ్జి మారెంరెడ్డి అర్పిత సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలు బోధించారు. యువతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, దురలవాట్లకు గురైతే కలిగే దుష్పరిణామాలు, వాటి పర్యావసనాలకు లోనవుతున్న టీనేజ్ బాలికల తీరు, జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి మారెంరెడ్డి అర్పిత

నిరవధిక దీక్ష భగ్నం


విజయధర్మాను అదుపులోకి తీసుకుంటున్న ఎస్సై

జన్నారం(ఖానాపూర్): అక్రమ పట్టాదారులపై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకుడు, చింతగూడ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ విజయధర్మా గురువారం తలపెట్టిన నిరవధిక దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఇటీవల తపాలపూర్‌కు చెందిన ఇద్దరు అధికారపార్టీ ప్రజాప్రతినిధులు సింగరాయిపేట్ సీలింగ్ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నట్లు రుజువైనా వారిపై చర్యలు తీసుకోకపోవడంతో దీక్షకు పూనుకున్నారు. దీక్షలో పాల్గొనేందుకు వస్తుండగా బస్టాండ్ సమీపంలో ఎస్సై సతీశ్ అడ్డుకుని ముందుగా లక్సెట్టిపేట్ పోలీస్ స్టేషన్‌కు, అక్కడి నుంచి జన్నారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం జన్నారం పోలీస్ స్టేషన్‌లో దీక్ష చేస్తున్నట్లు విజయధర్మా ప్రకటించారు.